# లక్ష్యం లోని వైరుధ్యం

ప్రియమైన స్నేహితులారా,

మనం పూజ్య బాబూజీ మహారాజ్ వ్రాసిన గ్రంథాలు చదువుతూంటే, అనేక సందర్భాల్లో ఆయన, అసలు మనం యాత్రను ప్రారంభించక ముందే గమ్యాన్ని నిర్దుష్టంగా ఏర్పరచుకోవాలని చెబుతూన్నట్లుగా కనిపిస్తూ ఉంటుంది. ఈ భావాన్నే అనేక రకాలుగా పదే పదే వెలిబుచ్చుతూంటారు. అయితే, అత్యున్నతమైన దశతో సహా ఏ దశకైనా చేరుకోవాలన్న కోరిక, మన హృదయంలో గనుక లేశమాత్రం ఉన్నా కూడా, అది మన దారిని ప్రక్కకు మళ్ళిస్తుందని మనకర్థమవుతుంది. వాస్తవానికి అది మనలనేమీ సాధించనివ్వదు కూడా. ఆధ్యాత్మిక రంగంలో సాధించడం అనేది 'నేను' అన్న భావాన్ని విలీనం చేసుకోవడం పైన ఆధారపడి ఉంటుంది. ఏదొక ఆధ్యాత్మిక దశ కోసం గాని లేక ఏదొక ఆధ్యాత్మిక స్థితి కోసం గాని తపించడం వెనుక 'నేను' అన్న భావమే ఉంటుంది. మనం ఏ స్థితి కోసం తపిస్తున్నామో అందులోకి ప్రవేశించనివ్వకుండా అడ్డు పడేది ఈ 'నేను' అన్న భావమే. కాబట్టి, అది అత్యున్నతమైన లక్ష్యమైనా లేక మధ్యలోని ఏ లక్ష్యమైనప్పటికీ కూడా, అదే ఆ లక్ష్యాన్ని సాధించనివ్వకుండా అడ్డు పడుతుంది. ఆధ్యాత్మిక జీవితంలోని ప్రధాన వైరుధ్యం ఇదే. మనం ముందుకు సాగాలనుకుంటే దీన్ని పరిష్కరించుకోవాలి.

బాబూజీ స్వయంగా తన జీవితాన్ని సాగించిన విధానాన్ని పరిశీలిద్దాం. ఆయనకు లక్ష్యం అనేది ఉండిందా? తన చిన్నతనంలో, ఆయన తల్లిగారు సాంప్రదాయంబద్ధంగా తరచూ చేసే పూజలను గమనిస్తూండేవారని ఆయన వ్రాసుకోవడం జరిగింది. ఆరు-ఏడు సంవత్సరాల వయస్సులో ఉండగా ఆ పూజా విధాన్నాన్ని తనకు కూడా నేర్పమని ఆయన తన తల్లిని కోరారు. ఆమె గంధంతో నుదురు మీద బొట్టు పెట్టడం ప్రారంభించింది. ఆయనకు కూడా తను ఆ రోజు చెయ్యవలసిన పూజ చేసేశానన్న తృప్తితో ఉండేది. కొన్ని సంవత్సరాల తరువాత సత్యాన్ని గురించిన తృష్ణ ప్రారంభమయ్యింది, అదే భగవద్గీత చదవడానికి దారి తీసింది. ఆ తరువాత వాళ్ళ ఆస్థాన పురోహితుడు ఆయనకు 'రామ రామ' అని నామజపం చెయ్యమని చెప్పడం జరిగింది. అది ఆయన కొంతకాలం శ్రద్ధగా చేశారు. కాని దాని వల్ల ఆయన హృదయానికి సంతృప్తి కలుగలేదు. చివరికి ఒకానొక రోజున ఆయనలో సత్యాన్ని తెలుసుకోవాలన్న తృష్ణ లాలాజీ మహారాజ్ వద్దకు తీసుకు వెళ్ళింది. వారిని చూసిన మొట్టమొదటి క్షణంలోనే బాబూజీ మంత్రముగ్ధులైపోయారు. తన స్వంత గూటికి చేరుకున్న అనుభూతి వారికి కలిగింది.

బాబూజీ ఎప్పుడూ కూడా లాలాజీ ద్వారా ఏ విధంగానూ తనలో ఉన్నవేవీ నెరవేరాలన్న దృక్పథం ఎప్పుడూ లేదు. ఆధ్యాత్మిక పురోగతి గాని, గురువు నుండి ప్రేమ గాని, వాత్సల్యం గాని, ఏమీ ఆశించలేదు. ఆయనకు లాలాజీ పట్ల హృదయపూర్వకమైన ప్రేమ ఉన్నప్పటికీ కూడా. బాబూజీ జీవితం అంతా గమనిస్తే ఒక్కటంటే ఒక్క విషయమే మనకు గోచరిస్తుంది: సంపూర్ణంగా, ఏకాగ్ర మనస్సుతో తన మాస్టరుకు అంకితమైపోవడం. ఆయన దృష్టిలో లాలాజీ తప్ప మరొకటి ఉండేది కాదు; ఆయన పాదాల చెంత సంపూర్ణ శరణాగతి స్థితిలో ఉంటూ, కొలవలేనంత ఆధ్యాత్మిక పురోగతిని సాధించిన ఉదాహరణ చరిత్రలో బహుశా ఇంతకుముందు మరెవ్వరూ లేరు.

సాధారణంగా లయావస్థే సాధించదగ్గ అత్యున్నత సిద్ధిగా భావిస్తారు, కాని బాబూజీ జీవితాన్ని పరిశీలిస్తే, మరొక విధంగా అనిపిస్తుంది. లయావస్థను దాటిన తరువాత కూడా సిద్ధింపజేసుకోవలసినవి చాలా ఉన్నాయని తెలుస్తుంది. ఉదాహరణకు తన గురువుతో సంపూర్ణమైన ఏకత్వాన్ని సిద్ధింపజేసుకోవడం, ఇది గాక ఇంకా ముందుకు యాత్ర చాలా ఉందన్న అవగాహన మనకు ఆయన జీవితాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది. సంపూర్ణ ఏకత్వం తరువాత కలిగే ఆధ్యాత్మిక స్థితులను వర్ణించడానికి అసలు మాటలుండవు.

అయినా, బాబూజీ దివ్య కానుకలను పుష్కలంగా అందుకున్నప్పటికీ కూడా ఆయన వాటి కోసం ఎప్పుడూ తపించలేదు. ఇటువంటి దీవెనల కోసం ఏనాడూ ఆయన తపించకపోయినప్పటికీ, లాలాజీ పట్ల ఆయనకున్న పూజ్య భావం ఎంత పరిపూర్ణంగా ఉండేదంటే, లాలాజీ తనకు ప్రసాదించిన ఆధ్యాత్మిక స్థితులన్నిటిపైన సంపూర్ణ ఆధిపత్యం ఆయన సాధించడం జరిగింది. ఆయన గురువు యొక్క కృషిని ఎంత అమూల్యంగా భావించేవారంటే, వారి కృషి ఎప్పటికీ వ్యర్థం కానిచ్చేవారు కాదు. అందుకే తనపై తాను విపరీతంగా కష్టపడి పని చేసుకొనేవారు.

లాలాజీ ఎప్పుడైనా బాబూజీని అటువంటి జీవన విధానాన్ని అనుసరించమని గాని, అంత అంకితభావంతో ఉండమని గాని, ఆ విధంగా శరణాగతితో ఉండమని గాని ఆదేశించారా? బాబూజీకి తన గురువు పట్ల హృదయంలో సహజంగానే అటువంటి ఉదాత్తమైన భావన ఉద్భవించింది. ఆ తరువాత తాను మాస్టరుగా మారినప్పుడు కూడా బాబూజీలో ఆ స్వభావం అలాగే ఉండిపోయింది – ఎవ్వరినీ తన పట్ల భక్తితో ఉండమని గాని, అంకితభావంతో ఉండమని గాని, శరణాగతితో ఉండమని గాని ఎవ్వరినీ కోరడం జరుగలేదు. ఫలితంగా, ఆయన అభ్యాసులు దురదృష్టవశాత్తు ఈ అసలైన పథాన్ని అనుసరించాలన్న విషయాన్ని తెలుసుకోలేకపోయేవారు. కాని బాబూజీ ఈ విషయంలో వారికి మార్గదర్శనం చేయలేకపోయేవారు. ఆయన

నిష్కళంకమైన శీలం, ఆయనలోని పరిపూర్ణమైన వినమ్రత, ఈ విషయాన్ని నేరుగా తెలియజేయనీయకుండా ఆయన చేతులు కట్టేసాయి. దానికి బదులుగా ధ్యేయాన్ని సూక్ష్మంగానూ, పరోక్షంగా ఉండే పదజాలంతోనూ నిర్వచించడానికి ప్రయత్నించేవారు: ఉదాహరణకు 'కేంద్రం (సెంటర్)' అని, 'సాక్షాత్కారం' అని, 'భగవంతునితో సంపూర్ణ ఐక్యం' అని చెబుతూండేవారు. 'నన్నే లక్ష్యంగా తీసుకోండి' అని నేరుగా ఎప్పుడూ చెప్పలేకపోయేవారు. ఎలా చెప్పగలుగుతారు పాపం! ఆయన హృదయంలో తనకొక ఉనికి ఉందనే భావనే లేనప్పుడు? కాని మన సంస్థ ప్రార్థనలో మాత్రం మాటలు, ఈ పంక్తుల్లో స్పష్టంగా ఉన్నాయి:

> *ఓ మాస్టర్! మానవ జీవితమునకు యదార్థ లక్ష్యము నీవే.*
> *మేమింకనూ కోరికలకు బానిసలమై యుండుట మా ప్రగతికి ప్రతిబంధకమై యున్నది.*
> *మమ్ము ఆ దశకు జేర్చు ఏకైక స్వామివి, శక్తివీ నీవే.*

ఈ పంక్తులు బాబూజీ నుండి ఉద్భవించినవి కావు; స్వామి వివేకానంద నుండి వారు చెబుతూంటే విని అందుకున్నవి, వాటిని మాటల్లోకి తర్జుమా చేసి ఉన్నత లోకాల నుండి వచ్చిన ఆజ్ఞలను అనుసరించి బాబూజీచే అందజేయబడినవి. అప్పుడప్పుడు బాబూజీని, ప్రార్థనలో చెప్పిన ఈ మాస్టర్ అంటే ఎవరు అని అడుగుతూండేవారు. దానికి బాబూజీ వెంటనే 'భగవంతుడే నిజమైన మాస్టరు' అని స్పందించేవారు. మరి ప్రార్థన భగవంతుడిని ఉద్దేశించే ఉన్నప్పుడు, 'మమ్ము ఆ దశకు జేర్చు ఏకైక స్వామివి, శక్తివీ నీవే' అని మళ్ళీ చెప్పడం ఎందుకు? ఈ వాదన ఆలోచించ దగ్గది; ప్రతి ఒక్కరూ స్వంతంగా తమదైన నిర్ధారణకు రాగలగాలి.

ప్రార్థనలోని మొదటి పంక్తి, మాస్టరును లక్ష్యంగా తీసుకోవడం అంటే ఏమిటో అనేది ఎక్కడా సూచించదు. ఈ భావన నుండి మనం ఎటువంటి నిర్ధారణకు రావచ్చు? దీని అర్థం మనం ఆయనలో లయమైపోవాలనా? మనం ఆయనతో ఏకత్వం పొందడానికి ప్రయత్నించాలనా? ఆ విధంగా ఆలోచించడం ప్రార్థనను అపార్థం చేసుకుంటున్నట్లే, పైగా మనలను ప్రక్కదారి పట్టిస్తుంది కూడా. లయావస్థను పొందడం గాని లేక గురువుతో ఏకత్వాన్ని సాధించడం గాని కోరడం అనేది విపరీతమైన కోరిక అయిపోతుంది. అటువంటి స్థితిని కానుకగా ప్రసాదించడం అనేది మాస్టరు చెయ్యవలసిన పని, శిష్యుడు చెయ్యవలసింది అనడం కంటే కూడా. అలా అయినప్పుడు అది నా లక్ష్యం లేక ధ్యేయం ఎందుకవుతుంది? అటువంటి భావాన్ని పోషించడం వల్ల నా గురువు యొక్క భావనలను నాకు అనుకూలంగా మార్చుకొనే ప్రయత్నం చేసుకొనే విధంగా దారి తీస్తుంది – అప్పుడు అది నిజమైన ఆత్మ-విధ్వంసక చర్య అవుతుంది.



ఇంకా చెప్పాలంటే, నేను లయావస్థ పొందాలన్న ఆకాంక్షే నన్ను ఆ సిద్ధిని పొందనివ్వకుండా చేస్తుంది; ఎందుకటే అది ఆ ఆకాంక్ష అడుగున ఉన్న 'నేను' అనే భావాన్ని బలోపేతం చేస్తుంది కాబట్టి. ఇలా ఉండగా బాబూజీ లక్ష్యం కోసం విపరీతమైన తపనను, గాఢమైన కోరికను పెంపొందించుకోమని కూడా బలంగా సిఫారుసు చేయడం జరిగింది. ఆయన మాట్లాడుతున్న తపన ఎటువంటిదై ఉండాలి? తపనలో వివిధ స్థాయిలున్నాయి. అథమరకం తపన మనం వెళ్ళాలనుకున్న చోటు దరిదాపుల్లోకి కూడా తీసుకెళ్ళదు, అది ఎంత తీవ్రంగా ఉన్నప్పటికీ. ఉదాహరణకు, ప్రియతముడి విరహం మూలాన కలిగే తపన అనేది కేవలం ప్రియతముడు ఇచ్చే కానుకల కోసం తపించడం కంటే చాలా భిన్నంగా ఉంటుంది. మీ ప్రియతముడు గనుక మిమ్మల్ని ఏవిధంగా వినియోగించుకోవాలో అన్న ప్రయత్నంలోనే నిరంతరం ఉన్నాడనుకోండి, ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహించండి!

తపనలో సూక్ష్మంగా ఉండే రకంలో మాస్టరు యొక్క భౌతిక సాన్నిధ్యం ఉండాలన్న కోరిక ఉండదు. బాబూజీ తన సహచర్యుల్లో ఒకరికి వ్రాసిన ఉత్తరంలో ఇలా వ్రాస్తారు, "నిజం చెప్పాలంటే మాస్టరు యొక్క భౌతిక రూపం భగవంతుడు కాదు, దివ్యత్వం అనేది దాని వెనుక ఉన్నది. కాబట్టి నన్ను నేను సమర్పించుకున్నది ఆ దివ్యత్వానికి, భౌతికంగా ఉండే జీవికి కాదు." ఇంకా ఆయన ఇలా వ్రాసారు, "మాస్టరు యొక్క రూపాన్ని పూర్తిగా మీ దృష్టిలోకి తీసుకువచ్చినట్లయితే, దివ్యత్వం వెనుకబడిపోతుంది" అని వ్రాసారు. ఇక్కడ బాబూజీ మాస్టరు భౌతిక దర్శనం చేసుకోవాలని చెప్పడం లేదు, అది ఆయన అనుసరించిన మార్గం కూడా కాదు. దర్శనం అనేది అంతరంగంలోనే జరుగుతుంది; అంతేగాక మాస్టరును కలవగలిగేది కూడా కేవలం ధ్యానస్థమైన స్థితిలో మాత్రమే.

ఈ స్ఫూర్తితోనే బాబూజీ తనదైన ధ్యాన పద్ధతిని అవలంబించడం జరిగింది, అది లాలాజీ ఆయనకు నిర్దేశించినది కాదు (ఆయన నిశ్శబ్దంగా ఆరాధించే పద్ధతి). ఆయన సహజంగానే లాలాజీ భౌతిక రూపం ఆ పరమాత్మతో అనుసంధానమై ఉన్నదన్న భావనతో రూపం మీద ధ్యానించడం ప్రారంభించారు. "అది నాకు మాత్రమే" అని అంటూండేవారు ఆ తరువాత. ఇక్కడ కూడా తనను తాను ఏ విధంగానూ అభ్యాసులపై మోపాలని కాదు. వ్యక్తిగతంగా తాను ఎవరి జీవితంలోనూ ప్రవేశించాలన్న ఆలోచన ఆయన స్వభావంలోనే లేదు. కాబట్టి అటువంటి విషయాలకు సంబంధించిన సందర్భాలు వస్తే అతను నేరుగా చెప్పగలిగే అవకాశమే లేదు. ఆయనకు ఆ విధంగా నేరుగా ఉండవలసిన అవసరం లేదు కూడా; ఎందుకంటే శిష్యుడు తనంతట తాను ఆ మార్గాన్ని చూడగలిగితే తప్ప, అటువంటి మార్గదర్శకత్వానికి అవరోధాలే ఎదురవుతాయి; అదే శిష్యుడు గనుక సత్యాన్ని చూడగలిగినట్లయితే, అప్పుడు నేరుగా చెప్పవలసిన అవసరమే ఉండదు.

నిగూఢమైన జ్ఞానం ఎప్పుడూ ఇలాగే ఉంటుంది. ఇది లోపల నుండి సహజంగా రావాలి. కోతికి చెట్టు ఎలా ఎక్కాలో చెప్పక్కర్లేదన్నట్లుగా. ఎటువంటి అవరోధాలూ లేకుండగా సహజమైన రీతిలో సరైన విధానానికి దారి తీసేది కేవలం అభ్యాసం లేక సాధన ద్వారా మాత్రమే. బయట నుండి గాకుండగా మన లోపలి నుండి వస్తుంది కాబట్టి అవరోధాలు ఉండే అవకాశమే లేదు. సాధారణంగా మనం విభేదించవలసిన అవసరం వచ్చేటువంటి జ్ఞానం మనకు లోపలి నుండి కలగడం జరుగదు. ఇంకా చెప్పాలంటే, ఇది మనలో సరైన భావాన్ని లేక వైఖరిని కలిగిస్తుంది. ఇది మన యొక్క సత్యశీలతను బట్టి వస్తుంది; క్రమక్రమంగా వెలుగులోకి రావడం మూలాన కలుగుతుంది; దాన్ని మన వైఖరి ప్రతిబింబింపజేస్తుంది.

బాబూజీ మనకు ప్రసాదించిన ధ్యానము, శుద్ధీకరణ లేక నిర్మలీకరణ, ప్రార్థన అనే ప్రక్రియలు చాలా విశిష్టమైనవి. ప్రపంచం అంతా ధ్యానం గురించి మాట్లాడుతున్నప్పటికీ, అన్ని ప్రక్రియల్లోనూ కూడా నిజమైన ధ్యానస్థితిని కలుగజేసే సమర్థత కొరవడుతుంది. కొందరు కొన్ని గంటలు, లేక కొన్ను రోజులు, లేక కొన్ని నెలలు ధ్యానం చేస్తున్నామన్న తృప్తి కలిగి ఉండవచ్చునేమో. ఇంత ఎక్కువ సమయం కూర్చోగలమని, ఇంత కాలం తినకుండా ఉపవాసం చెయ్యగలమని, ఇంత కాలం ఏకాంతంగా ఉండగలమని గర్వించవచ్చు కొందరు. అయినప్పటికీ కూడా అసలు వర్ణించనలవి కాని నిజంగా ప్రత్యేకమైన ఈ ధ్యాన స్థితులు మాత్రం వాళ్ళకు అందుబాటులో లేవు.

యౌగిక ప్రాణాహుతిని మళ్ళీ మళ్ళీ అందుకోవడం ద్వారా, మనం ఈ స్థితుల్లోకి ఇంచుమించుగా వెనువెంటనే వెళ్ళగలుగుతున్నాము. బాబూజీ ప్రపంచానికిచ్చిన కానుక ఇదే; దీన్నే మనం ప్రజలందరికీ తెలియజేయాలనుకుంటున్నాం.

ధ్యాన స్థితిలో మనలను మనం ఉపసంహరించుకోవడం ద్వారా అంతరంగంలో కేంద్రీకృతమవుతాం. మన ఎంతగా అంతర్ముఖులమవుతామంటే, తత్ఫలితంగా కలిగే విలీన స్థితి మన దైనందిన కార్యకలాపాల్లో ప్రతింబింబిస్తుంది; కాని మనం ఈ విధంగా మన కేంద్రంలో స్థిరపడిన స్థితిని కొనసాగించడంలో జాగ్రత్త వహించాలి. నిరంతరం ఈ విధంగా కేంద్రంలో స్థిరంగా ఉండటానికే 'నిరంతర స్మరణ' అని మరొక పదం ఉంది. ముఖ్యంగా అటువంటి విలీన స్థితిని కానుకగా ప్రసాదించినవారి పట్ల కృతజ్ఞత ఉన్నప్పుడు ఇది సాధ్యపడుతుంది. ఈ కృతజ్ఞతలో మనం పూర్తిగా కరిగిపోతాం అంతే.



ఇక ఇప్పుడు మహనీయుడైన మాస్టరుతో అనునాదం కలిగి ఉండే విషయానికొద్దాం. కేవలం ధ్యానం వల్ల మాత్రమే ఇది సాధ్యపడదు. శుద్ధీకరణ లేకుండా, ముద్రలు, కోరికలు హృదయంలో ఉండిపోయి మన దృష్టిని బయటకు లాగేస్తాయి; చొచ్చుకుపోలేనంతగా ఒక పొర ఏర్పడి మనలను లోపలికి మునక వేయనీయకుండా చేస్తుంది.

మనలో చాలా మంది శుద్ధీకరణ ప్రక్రియను కేవలం సంస్కారాలను లేక ముద్రలను తొలగించే ప్రక్రియ అన్న అవగాహనే ఉంది. కాని సంస్కారాలను తొలగిస్తే కలిగే ఫలితం ఏమిటి? సంస్కారాలు తొలగిపోవడం వల్ల శూన్యత ఏర్పడుతుంది. ఫలితంగా మనం మరింత మరింత తేలికైన స్థితులను అభివ్యక్తీకరించడం ప్రారంభిస్తాం; ఈ విధంగా ఈ శూన్యత అనే ముసుగులో మనం మన నూతన వ్యక్తిత్వాన్ని రూపకల్పన చేసుకుంటాం. ఈ నూతన స్థితి 'మరింత మరింత తగ్గించుకోవడం అనేది మరింత మరింత ఎక్కువ అవడం (మోర్ అండ్ మోర్ ఆఫ్ లెస్ అండ్ లెస్)' కు ప్రతిరూపంగా ఉంటుంది. 'నథింగ్‌నెస్ (శూన్యత)' అనే పదాన్ని రెండు పదాలుగా పద-విచ్ఛేదం చేస్తే బాగా అర్థం చేసుకోవచ్చు: నో – థింగ్‌నెస్. అంటే ఇక ఏ వస్తువు కోసం కోరిక మిగల్లేదని అర్థం. మీ కేంద్రీకృతమైన ధ్యాన స్థితి నుండి బయటకు తీసుకువెళ్ళేది ఏదీ ఉండదన్నమాట. అయితే దీని వల్ల చెయ్యవలసిన ప్రాపంచిక కార్యకలాపాలను వేటినీ విడిచిపెట్టనవసరం లేదు; దీనికి భిన్నంగా వీటిని మరింత మెరుగైన విధంగా నిర్వర్తించుకోగలుగుతాం.

శుద్ధీకరణ లేకుండగా ధ్యానం ఏ విధంగా సరిపోదో, ధ్యానం లేకుండగా శుద్ధీకరణ చేయడం వల్ల కూడా ఉండే పర్యవసానాలు ఉంటాయి. ధ్యానంలో కలిగే విలీన స్థితి లేకపోతే, శుద్ధీకరణ వల్ల అంతరంగంలో ఏర్పడిన శూన్యత మరిన్ని మరిన్ని ముద్రలను ఆకర్షించడం ద్వారా భవిష్యత్తులోని కోరికలకు బీజాలు వేయడం జరుగుతుంది. శూన్యత ఎంత వరకూ ప్రయోజనకరంగా ఉంటుందంటే, శూన్యత అనే సరళమైన ముసుగును ధరించిన వ్యక్తిత్వంపై దృష్టి నిమగ్నమై ఉన్నంత సేపే ప్రయోజనకరంగా ఉంటుంది. వ్యక్తిగత స్థాయిలో నెరవేర్చుకొనేందుకు ఇక స్వార్థపూరితమైన సంకల్పాలేవీ లేనటువంటి మాస్టరుపై దృష్టి నిమగ్నమై ఉన్నప్పుడు.

ఈ శూన్యత్వం లేక శూన్య స్థితి యొక్క పరాకాష్ఠే 'నేను' అనే భావం పూర్తిగా లేకపోవడం, ఇక మీ కోసం మీరు జీవించడం ఉండదు. అదే శరణాగతి అంటే. అంత అందమైన శరణాగతి స్థితికి అతి సమీపంలో ఉండేదే సమర్పణ భావం. ఆధ్యాత్మిక రంగంలో ప్రారంభ దశలో ఉన్నవారికి సమర్పణ అనే శబ్దం తరచూ ఆందోళన కలిగిస్తూ ఉంటుంది, ఎందుకంటే ఈ పదాన్ని ఓటమితో ముడి పెట్టుకుంటారు కాబట్టి. శరణాగతి అంటే

ఓటమి కాదు. నేను నా తల్లి రక్షణలో క్షేమంగా ఉన్నానన్న భావం ఆనందాన్నే కలిగిస్తుంది. శరణాగతి స్థితికి చేరుకున్న భక్తుడి స్థితి అలాగే ఉంటుంది.

"మరణానికి ముందు మరణించడమే ముక్తికి మార్గం" అని బాబూజీ చాటి చెప్పారు. ఇందులో భయపడటానికేమీ లేదు. మీరు పోగొట్టుకున్నదేదీ లేదు. నిజానికి ఒక భక్తుడు అందుకో గలిగే అద్భుతమైన దీవెనను అందుకున్నారు మీరు; అది మరేదో కాదు గురువు యొక్క మనసు, అంతకంటే స్వంతం చేసుకోదగ్గ వస్తువు మరేదీ లేదు కూడా ఈ లోకంలో. ఈ పరిస్థితిలో గురుశిష్యులు ఇద్దరూ ఒకరి స్మరణలో మరొకరుంటారు. శిష్యుడు ఆతని గురువు పాదాల చెంత శరణాగతిని కోరాడు. అలాగే గురువు కూడా తన శిష్యుని పాదాల చెంత శరణాగతి నొందాడు. ఇది పరస్పరంగా జరిగేది.

శరణాగతి నిజమై యుండాలి. అది మీ సచ్ఛీలత అయి ఉండాలి, మీ తత్త్వమే ఆ విధంగా అయి ఉండాలి. అది కృత్రిమంగా ఉన్నట్లయితే మాస్టరు మీ నుండి దూరంగా ఉండటానికి ప్రయత్నించడం గమనించవచ్చు; ఎందుకంటే మీ 'శరణాగతి' లో వేరే ఉద్దేశాలేవో ఉన్నాయి కాబట్టి. మీరు ముక్తి కోసం వెంట పడినా లేక కేంద్ర మండలంలోకి (సెంట్రల్ రీజియన్) ప్రవేశం కోరినా కూడా, అటువంటి కోరికలతో గురువును సమీపించకుండా ఉండటం నయం; ఆ కోరికలను తొలగించాలన్న ప్రార్థనలతో ఆయన దగ్గరకు వెళ్ళాలి తప్ప మరొక కారణంతో వెళ్ళకూడదు.

అయితే గురువు మనకు మోక్షం గాని కేంద్ర మండలంలోకి ప్రవేశాన్ని గాని ఇవ్వకూడదని కోరుకోడు. ఇంకా చెప్పాలంటే, తాను సాధించిన ఉన్నతి కంటే కూడా అంతకు మించిన మరింత ఉన్నత శిఖరాలకు మనం ఎదగాలని కోరుకుంటాడు. అయినా కూడా, జరుగవలసిన మంచి అంతా కూడా ఈ సంబంధంలో ఉండే పవిత్రత ద్వారానే జరుగుతుంది; దీన్ని మనం మరే ఇతర లక్ష్యం కోసమూ కోల్పోకుండా ఈ గురుశిష్యుల అనుబంధాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సంరక్షించుకోవాలి.

బాబూజీ జనాల్లో సిద్ధులు కావాలనే కోరికలకు తరచూ లొంగిపోవలసి వచ్చేది. ఆయన చాలా మందిని, మామూలు మార్గంలో చేరుకోవడం దుస్సాధ్యమయ్యే కేంద్ర మండలంలోకి (సెంట్రల్ రీజియన్‌లోకి) ఎంతో కుశలతనుపయోగించి చేర్చేవారు. వాటి అశాశ్వతమైన ఫలితాలుగా మిగిలిపోవడం విచారకరం. వాళ్ళు ఆ దివ్యస్థితిలో ఉండే ప్రత్యేకమైన సూక్ష్మత్వంతో శృతిలో ఉండలేక అక్కడ ఎక్కువ కాలం నిలబడలేకపోయారు. తత్ఫలితంగా వాళ్ళు పతనమవడం జరిగింది. ఈ విధంగా కేంద్ర మండలానికి



చేరిన పెద్దలు క్రిందకు జారడం ప్రారంభించడంతో ఆ మహానుభావునికి, ఆ ఆధ్యాత్మిక పథానికీ కూడా చెడ్డ పేరును తీసుకువచ్చారు వాళ్ళు. అటువంటి వ్యక్తులను ప్రకృతి క్షమిస్తుందా? బాబూజీ జీవితకాలంలో బేషరతుగా సేవలనందించేవారు గాని సాధన చేసినవారు గాని ఉండటం చాలా అరుదు. ఆయన డైరీల్లో, ఈ విషయంపై లాలాజీ వ్యాఖ్యానించిన సందర్భాలు కనిపిస్తాయి:

> **ఆగస్టు 18, 1944:**
> పూజ్య లాలాజీ: "తనను తాను భక్తుని గానూ, ఆయనను ఆరాధనా వస్తువు గానూ భావించడం అనేది మనుషుల్లో ఉండవలసిన మర్యాద. జనం ఈ స్థానాన్ని మరచిపోయి, భగవంతుని తమ అవసరాలు తీర్చే పరికరంగా భావిస్తారు. ఇది దేవీ-దేవతలకు, గురువుకు కూడా వర్తిస్తుంది."

> **ఆగస్టు 23, 1944:**
> పూజ్య లాలాజీ: "ఎటువంటి స్వార్థ ప్రయోజనం లేకుండా నీ పట్ల మొగ్గు చూపేవాళ్ళు బహుకొద్ది మందే ఉంటారు."

భౌతిక ప్రయోజనాల కోసం గాని లేక ఆధ్యాత్మిక పురోగతిని దృష్టిలో పెట్టుకొని గాని అభ్యాసం చేయడం అనేది ప్రారంభ దశలో ఆమోదించవచ్చును. కాని ఇటువంటి ఆలోచనల నుండి సాధ్యమైనంత త్వరలో బయటపడేలా కష్టపడి నిజమైన అభ్యాసులుగా మారాలి. అభ్యాసం అంటే కేవలం అభ్యాసం చేయడం అంతే.

అయితే ఇది సాధనకు భిన్నమైనది; సాధన అంటే ఒక ప్రత్యేకమైన లక్ష్యాన్ని మనసులో ఉంచుకొని అభ్యాసం చేయడం – సాధకుడు సాధించాలనుకున్న ముక్తి గాని, లేక మరే ఆధ్యాత్మిక స్థితి గాని లేక సిద్ధి గాని లేక మరేదో ధ్యేయం గాని మనసులో పెట్టుకొని అభ్యాసం చేయడం. అభ్యాసం అనేది సాధన్కు విరుద్ధంగా రెండు వైపులా తెరచి ఉన్న వాహకం వంటిది. నిష్కామ కర్మ స్ఫూర్తితో మనం మన అభ్యాసం యొక్క ఫలితాలను మాస్టరు యొక్క వివేకంతో కూడిన తీర్పుకు సమర్పిస్తాం. కాబట్టి అభ్యాసులంటే శరణాగతి స్థితిలో ఉన్నవారని నిర్వచించవచ్చు. గీతలో చెప్పిన కర్మ అనే సనాతన ధర్మం ఆధ్యాత్మిక రంగంలో కూడా వర్తిస్తుంది. శరణాగతి లేకపోయినట్లయితే మనం కేవలం సాధకులమే అవుతాం; ఏదైనా స్థితిని గాని సిద్ధిని గాని పొందడం అనేది చిన్నదైపోతుంది.

సహజమార్గంలోని మరో అందమైన అంశ ఏమిటంటే, నా మనసులో గాని నా హృదయంలో గాని అడగటానికి ఏమీ లేకపోయినట్లయితే, దాని వల్ల మనలో ఏర్పడే శూన్యత దివ్యకృపను ఆకర్షిస్తుంది. అప్పుడు ఆయనే స్వయంగా మనలో దిగి ముందుకు నడిపిస్తారు. మనం ఎంత కోరికల్లేకుండా తయారవుతామో అంత ఎక్కువగా ఆయన మనకు సహాయపడటం జరుగుతుంది. పంచ భూతాలకు అతీతంగా పిండ ప్రదేశ్ ను దాటితే మనకు మోక్షం తథ్యమని మనం పదే పదే వింటూ ఉన్నాం. మోక్షం అంటే కేవలం ఆ అయిదు చక్రాలను దాటడం కాదు. ప్రతీ చక్రమూ శూన్యంగా తయారవ్వాలి. శుద్ధీకరణ ద్వారా, మన జీవన శైలి ద్వారా, ఈ చక్రాలు మరింత మరింత సూక్ష్మంగా తయారైనప్పుడు నిరహంకారం, సంతృప్తి వర్ధిల్లుతూ ఉండాలి – మనం మొట్టమొదటి చక్రంలోనే ఉన్నా కూడా. ఈ పనిని తొమ్మిదో చక్రమో లేక పదో చక్రమో చేరుకొనే వరకూ వేచి ఉండగలిగే స్తోమత మనకుందా? అహంకారపూరితంగా ఉండే మన స్థితి అక్కడ ఆవిరైపోవడం ప్రారంభించే వరకూ మనం వేచి ఉండగలమా? ఇదెలా ఉంటుందంటే జిమ్‌కు వెళ్ళి ఎప్పుడూ జీవితంలో అంతకు ముందెప్పుడూ బరువెత్తని వాడు ఒక్కసారిగా 100 కిలోల బరువు ఎత్తడానికి ప్రయత్నించినట్లుగా ఉంటుంది. మనం ప్రతీసారి కొంచెం-కొంచెంగా పెంచుతూ సాధ్యమైనంతగానే పెంచుతూ పోవాలి. అంటే దాని అర్థం, అభ్యాసీలుగా అభ్యాసం ప్రారంభించిన మొట్టమొదటి రోజు నుండే ఈ శూన్యతను సృష్టించుకోవడం మొదలైపోవాలి. నిజమైన ఆధ్యాత్మిక స్థితి అంటే నిర్వచనం అహంకార రహితంగా ఉండటమే, మీరు యాత్రలో ఏ దశలో ఉన్నా కూడా. మంచి ఆధ్యాత్మిక స్థితి అంటే కేవలం లోపల శూన్యంగా అందుకొనే విధంగా ఉండటం, తనను తాను ఏ విధంగానూ కూడా భారమవకుండా ఉండటం. కేవలం సాక్షిగా ఉండటం, మన వైపు నుండి ఎటువంటి జోక్యం లేకుండా దైవేచ్ఛను రూపుదిద్దుకోనివ్వడం మంచి స్థితి అంటే.

రాధాకృష్ణులకు సంబంధించి ఒక చక్కటి కథ ఉంది. ఎప్పుడూ శ్రీ కృష్ణభగవానుడి అధరాలకు అంటిపెట్టుకొనే వేణువు అంటే ఆమెకు చాలా అసూయగా ఉండేది. ఒకసారి ఆమె ఆ వేణువును విరిచేద్దామనుకుంది. “ఈ వేణువు లోపలికి ఒకసారి చూసి, ఇందులో అసూయ పడటానికి ఏముందో చెప్పు” అని శ్రీ కృష్ణ భగవానుడంటాడు. రాధ లోపలికి చూసి, “ఇందులో ఈ వేణువులో ఏమీ లేదు” అన్నది, భగవానుడు చిరునవ్వుతో, “ఈ కారణం చేతనే, ఈ వేణువులో ఉన్న ఖాళీ వల్లే అంత మధురమైన సంగీతం నుండి ప్రవహిస్తోంది. అందులో ఒక్క వెంట్రుక ఉన్నా కూడా అందులో నుండి వచ్చే సంగీతం కలుషితమైపోయేది. ఆ మాధుర్యం నాశనమైపోయి ఉండేది” అన్నాడు.



మనం శ్రీ కృష్ణ భగవానుడి వేణువులా ఖాళీగా తయారైనట్లయితే, మన జీవితాలు ఎంత మధురంగా తయారవుతాయో ఊహించండి. సేవకు, భక్తికి ముందుగా కావలసినవి పూర్తిగా ఖాళీ అయిపోవడం. అందులో నుండి ఎటువంటి సంగీతం రావాలో నిర్ణయించేది వేణువు కాదు. నేను మరో రాగం పలుకుతాను అని అనడానికి ఉండదు వేణువుకి. ఏమి సంగీతం రావాలో అందులో నుండి నిర్ణయించేది మాస్టరు, వేణువు వాయించే వ్యక్తి. ఈ పనిముట్టు నుండి ఎటువంటి సేవ తీసుకోవచ్చో నిర్ణయించేది ఆయన.

పనిముట్టు నిజంగా ఎప్పుడైనా సేవ చేయగలదా? ఏ వేణువూ కూడా తనంతటా తానుగా మ్రోగదు. అందుబాటులో ఉండటం తప్ప మరేమీ అందించలేదు. అదే దానిలో ఉండే అందుకొనే స్థితి, ఖాళీ స్థితి; దానినే స్వామి వాయించడం ద్వారా వినియోగించుకోవడం జరుగుతుంది. ఈ అందుబాటులో ఉండటం అనేది అనేక రూపాల్లో ఉంటుంది. అందుబాటులో ఉండటం అంటే మనం ఏమీ చేయకుండా అలా వేచి ఉంటే గురువు వ్యక్తిగతంగా వచ్చి మనకు ఆదేశాలిస్తాడని కాదు దీని అర్థం. దీనర్థం ఏమిటంటే మనం ఎప్పుడూ తెరచిన హృదయంతో ఉంటూ, శూన్యంగా, సూక్ష్మంగా మన హృదయంలోకి వచ్చే అంతః ప్రేరణలను కూడా అందుకొనే స్థితిలో ఉండటం. ఇవే మనకు వారిచ్చే ఆదేశాలు; ఒక్కోసారి ఈ ఆదేశాలు నేరుగా గురువు నుండి వ్యక్తిగతంగా కూడా రావచ్చు. మిగిలిన సమయాల్లో, సూచనలుగా, సంకేతాలుగా మన చుట్టూ కనిపించవచ్చు. చాలా వరకూ అవి అంతరంగంలో నుండే వస్తాయి. అన్ని సందర్భాల్లోనూ కూడా, ఈ సూచనలు, సంకేతాలు, ప్రేరణలు అవి లోపల నుండి వచ్చినా బయట నుండి వచ్చినా అందులో ఉండే మాస్టరు నుండి వచ్చిన ఆనవాళ్ళను గుర్తించేది ఈ హృదయమే. మన పని మన అంతరంగంలో ఈ శూన్యత్వాన్ని సృష్టించుకోవడమే. ఆతరువాత మనలను ఆయన ఉపయోగించుకుంటాడా లేదా అన్నది ఆయన ఇష్టం. మనలను ముందుకు తీసుకు వెడతాడా లేదా అన్నది ఆయన చెయ్యవలసిన పని. నా మనసుకు సంబంధించినంత వరకూ అత్యున్నత లక్ష్యం ఏమిటంటే నా వల్ల మాస్టరు సంతోషంగా ఉండాలి, అంతే. అదే అన్నిటికీ అంతం.

మీ వల్ల సంతోషంగా ఉండటానికి మాస్టరుకు మీ పేరు గాని, మీ ముఖం గాని, లేక చివరికి మీ అంతరంగ స్థితి గాని ఆయనకు తెలియనవసరం లేదు. ఇవన్నీ అవసరం అయి ఉంటే గనుక ఈ పద్ధతి సమర్థవంతమైనది కానట్లే. మీరు సిట్టింగులు ఇవ్వడానికి ఒక రోజున ఒక ఊరు నుండి మరొక ఊరికి వెళ్ళినప్పుడు, తనంతతానుగా ఆయన అనుగ్రహం, ఆయన ప్రాణాహుతి మీలోకి ప్రవహించడం మొదలైపోతుంది. ఆ క్షణంలో మీరు మంచి పని చేస్తున్నారని ఆయనకు తెలియకపోవచ్చు. మీ గురించిన ఆలోచనే ఆయన మనసులో లేకపోవచ్చు. అయినా సరే, ఆయన మీ పట్ల సంతోషంగా ఉన్నట్లే; దీనికి మీ అంతరంగ

స్థితిలో కలిగిన మార్పే నిదర్శనం. అజ్ఞాతంగా పని చేయడం అంటే మన వంక చూస్తున్న వాళ్ళకి ప్రదర్శన చేయకుండా ఉండటం మాత్రమే కాదు. చాలా వరకూ మనం మాస్టరుకు కూడా ప్రదర్శించవలసిన అవసరం లేదని కూడా దీని అర్థం. ఆయనను మెప్పించాలన్న కోరికే లేకపోవడం. అజ్ఞాతంలో సంతృప్తికరంగా ఉండటం అనేది విశ్వాసానికి సంకేతం; అంటే ఆయన మెప్పు పొందడం కోసం గాని లేక ఆయన నుండి బహుమానాలందుకోవడం కోసం గాని మనలో ఋజువు చేసుకోవడానికేమీ లేదనుకున్నప్పుడు ఈ స్థితి కలుగుతుంది.

మనకు ప్రార్థన పట్ల ఉండే అవగాహనను బట్టి, ప్రార్థన పట్ల మనకుండే భావాన్ని బట్టి, లక్ష్యంలో ఉండే వైరుధ్యం, మన సంస్థ ప్రార్థనలో నొక్కి చెప్పడమూ జరిగింది, పరిష్కరించడమూ జరిగింది కూడా. ప్రార్థనలో అపరిమితమైనవి ఉన్నాయి; కాని ఈ ప్రార్థనను చూసే విధానంలో ఒక విధానం ఏమిటంటే, ఒకే దెబ్బతో ఈ మొదటి రెండు పంక్తుల్లో మన లక్ష్యం ఏమిటో తెలియజేస్తుంది; అలాగే ఆ లక్ష్యాన్ని కోరుకోవడమే, లక్ష్యాన్ని సాధించాలన్న కోరికే మనలను ముందుకు సాగనివ్వకుండా చేస్తోందని కూడా చెబుతోంది:

*ఓ మాస్టర్, మానవ జీవితమునకు యదార్థ లక్ష్యము నీవే.*
*మేమింకనూ కోరికలకు బానిసలమై యుండుట మా ప్రగతికి ప్రతిబంధకమై యున్నది.*

ఇక్కడున్న వైరుధ్యాన్ని ఎదుర్కోవడానికి, ఈ మూడవ పంక్తి మనలను రక్షిస్తుంది:

*మమ్ము ఆ దశకు జేర్చు ఏకైక స్వామివి, శక్తివీ నీవే.*

ఈ పంక్తి అర్థం ఏమిటి? బహుశా సాధించడం గురించి మరచిపొమ్మంటోందనుకుంటా; ఎందుకంటే ఈ ఆటలో ఉన్నది ఒక్క ఆటగాడే.

ఏమీ సాధించడానికి ప్రయత్నించని కృతజ్ఞతతో నిండిన హృదయానికి లక్ష్యం వల్ల ప్రయోజనం ఏముంటుంది? దీన్ని గనుక మనం హృదయపూర్వకంగా అంగీకరించినట్లయితే, మిగిలేది కేవలం కృతజ్ఞత మాత్రమే.



సంక్షిప్తంగా చెప్పాలంటే, మనం ఈ ధ్యాన పద్ధతిలో చేరినప్పుడు, ఒక్కోసారి మనం తెలియకుండానో, లేక వివిధ ధ్యేయాలతో ప్రారంభిస్తాం, లేక అప్పుడప్పుడూ ఏ ధ్యేయమూ లేకుండానే ప్రారంభిస్తాం కూడా. మనం మరింత మరింత ధ్యానం ఎక్కువగా చేస్తున్న కొద్దీ మనకు ఎదురైన వివిధ ఆధ్యాత్మిక స్థితులతో అనుబంధం ఏర్పడుతుంది. వాటిని మనం ఆనందించడం ప్రారంభిస్తాం, అభినందిస్తాం, ఆ తరువాత మరింత ఉన్నత స్థితుల కోసం తపిస్తూ ఉంటాం. కొంత కాలం తరువాత ఈ పరిస్థితి కూడా వీడ్కోలు పలుకుతుంది. మనలో చాలా మంది మనకు తెలియకుండానే, ఎరుకలో లేకుండానే ఉన్నత స్థితుల్లో సంచరిస్తూ ఉంటారు, ఏమి జరుగుతున్నదో తెలియని స్థితిలో. చివరికి ఒక నీటి చుక్క సముద్రంలో పడినట్లుగా, తనలో ఇక నీటి చుక్క అంటూ లేకుండా, "నేను సముద్రంగా మారిపోయాను" అని చెప్పడానికి కూడా వీల్లేకుండా ఉండే పరిస్థితికి చివరికి అభ్యాసి చేరుకుంటాడు – స్వంతగూటికి – గోడల్లేని ఇంటికి చేరుకుంటాడు. ఈ వైరుధ్యాన్ని అధిగమించేసినట్లే.

సముద్రంలో పడే ఒక నీటి చుక్కను, లయావస్థను వివరించడానికి వర్ణించవచ్చు, గాని ఆ తరువాత గురువుతో సంపూర్ణ ఏకత్వానికి సంబంధించిన దశల గురించి తెలియజేయాలంటే చాలా కష్టం. ఏ జిజ్ఞాసువూ కూడా అటువంటి ఏకత్వ స్థితిని తర్కానికి అతీతంగా ఉండే స్థితిని సరిగ్గా వర్ణించలేడు. కేవలం గురువు మాత్రమే అటువంటి స్థితిని గురించి మాట్లాడగలుగుతాడు. జూలై 22, 1944 న పూజ్య లాలాజీ ఈ విధంగా తెలియజేసారు: "రామచంద్ర నరాలను, రక్తనాళాలను గనుక తెరచి చూస్తే, అటువంటి శస్త్ర చికిత్స చేసే వ్యక్తికి సరైన దృష్టి ప్రసాదింపబడి ఉన్నట్లయితే, అతనిలో నా శక్తి మొత్తం అభివ్యక్తమవడం గమనిస్తాడు." మనం మన జీవితాల్లో అటువంటి దశకు త్వరలో చేరాలని ఆ మహనీయుడైన మాస్టరుకు మన విన్నపాలను నివేదించుకుందాం.

ప్రేమతో, గౌరవంతో,

కమలేష్ పటేల్

కాన్హా శాంతివనం, ఏప్రిల్ 30, 2019

(పూజ్యశ్రీ రామచంద్రజీ, షాజహాన్‌పూర్ 120వ వార్షిక జన్మదినోత్సవ సందర్భంగా)